# డబుల్ బెడ్రూమ్ కాలనీ సమస్యలు పరిష్కరిస్తా

**ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్**



బండ మైసమ్మ డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బన్సీలాల్‌పేట్, జూన్ 24: బండమైసమ్మ నగర్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వాసుల సమస్యలు అన్నింటినీ పరిష్కరిస్తామని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీ ఇచ్చారు. మంగళవారం బన్సీలాల్ పేట్ డివిజన్‌లోని బండమైసమ్మ నగర్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కాలనీలో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమకు సరిపడా నీరు రావడంలేదని మహిళలు ఫిర్యాదు చేయగా, ఎమ్మెల్యే వెంటనే స్పందిస్తూ నీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం ప్రస్తుతం ఉన్న సంప్‌కు అదనంగా మరో సంప్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అప్పటి వరకు నీటి కొరత ఏర్పడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని చెప్పారు. విద్యుత్‌లో ఓల్టేజీ సమస్య గురించి చెప్పగా, అవసరమైతే అదనపు ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేసే దిశగా పరిశీలించాలని విద్యుత్ అధికారులను ఆయన ఆదేశించారు. లిఫ్టులు కూడా పని చేయడం లేదని, దీంతో 5, 6 అంతస్తులు ఎక్కాలంటే మహిళలు, వృద్ధులు, పిల్లలు ఇబ్బందులు పడాల్సి వస్తున్నదని, ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దాంతో ఆయన త్వరలోనే లిఫ్టులను వినియోగంలోకి తీసుకొస్తామని చెప్పారు. ఆయన మాట్లాడుతూ..డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల వాసులు బ్లాక్‌ల వారీగా సమావేశమై కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని, తద్వారా సమస్యలను త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. 10రోజుల్లోగా కమిటీని ఎన్నుకోవాలని చెప్పారు. కాలనీలో నిర్మించిన షాపులను త్వరలో అద్దెకు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని, వాటి ద్వారా వచ్చే కిరాయిలను కమిటీ ఖాతాలో జమచేసి లిఫ్టుల నిర్వహణ, వాచ్‌మన్‌ల వేతనం కోసం ఉపయోగించాలని ఆయన సూచించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణం చేయక ముందు ఈ ప్రాంతం ఎంతో అధ్వాన్నంగా ఉండేదని, ఇండ్లను నిర్మిస్తామంటే అనేక అనుమానాలు వ్యక్తం చేశారన్నారు. నిర్మించిన ఇండ్లు పంపిణీ చేయగా.. మిగిలిన ఇండ్లను అర్హులైన స్థానికులకే పంపిణీ చేసేలా కృషి చేస్తానని చెప్పారు. సి-బ్లాక్ నివాసులు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను పరిశీలించి వారిని అభినందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ కుర్మ హేమలత, డిప్యూటీ కమిషనర్ డాకు నాయక్, వాటర్ వర్క్స్ జీఎం వినోద్‌కుమార్, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు వెంకటేశన్ రాజు, నాయకులు లక్ష్మీపతి, ప్రేమ్‌కుమార్, అబ్బాస్, అరుణ్ గౌడ్, కుమార్ యాదవ్, రజాక్ ఉన్నారు.

## బోనాలకు మరింత విశిష్టత: తలసాని



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ యాదవ్. చిత్రంలో మంత్రి మంత్రి పొన్నం ప్రభాకర్

బేగంపేట్, జూన్ 24: రాష్ట్ర పండుగగా ప్రకటించిన తర్వాతనే బోనాల ఉత్సవాల విశిష్టత మరింత పెరిగిందని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం సికింద్రాబాద్‌లోని శ్రీ ఉజ్జాయినీ మహంకాళి ఆలయం వద్ద వచ్చే నెల 13వ తేదీన నిర్వహించనున్న బోనాల ఉత్సవాల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే తలసాని మాట్లాడుతూ..తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పే బోనాల ఉత్సవాలను నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర పండుగగా ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. నాటి నుంచి ప్రతి సంవత్సరం ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నట్లు తెలిపారు. ఈ బోనాల ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది వస్తారని వివరించారు. బోనాల ఉత్సవాలు అంటేనే ప్రధానంగా గోల్కొండ, సికింద్రాబాద్, పాత బస్తీ ప్రాంతాల్లో ఎంతో సందడి ఉంటుందని చెప్పారు. వచ్చే నెల 13వ తేదీన నిర్వహించే మహంకాళి అమ్మవారి జాతర, 14వ తేదీన నిర్వహించే రంగం, అంబారీ పై. అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాలకు ఎలాంటి ఆటంకాలు ఏర్పడకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు.

## స్థానిక సంస్థలకు రిజర్వేషన్ ప్రకటించాకే ఎన్నికలు నిర్వహించాలి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బాలరాజ్ గౌడ్, అయిలి వెంకన్న గౌడ్ తదితరులు

చిక్కడపల్లి, జూన్ 24: స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లను రాజ్యాంగ బద్ధంగా ప్రకటించిన తరువాతనే ఎన్నికలకు వెళ్లాలని బీసీ కుల సంఘాల జేఏసీ కన్వీనర్, గౌడ కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగొని బాలరాజౌడ్ అన్నారు. మంగళవారం చిక్కడపల్లిలోని సమన్వయ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బాలరాజ్ గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్, బీసీ సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు సుగూరి దుర్గయ్య గౌడ్‌తో కలిసి మాట్లాడారు. ప్రభుత్వం చేసిన సమగ్ర సర్వేకు ప్రయోజనం లేకుండా పోతుందన్నారు. రాహుల్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా ఎన్నికలు చేపట్టాలని గొప్పలు చెప్పే ఈ ప్రభుత్వం బీసీల గురించి ఆలోచించడంలేదని మండిపడ్డారు. తమిళనాడు తరహాలో తెలంగాణలో కూడా బీసీ బిల్లును 9వ షెడ్యూల్డ్‌లో పెట్టి బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ జనశక్తి అధ్యక్షులు బైరు శేఖర్, బీసీ సంఘం నాయకులు బడే సాప్, బీసీ జన సైన్యం నాయకులు సింగం నాగేశ్వర్ గౌడ్, గౌడ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాలగొని వెంకటేశ్ గౌడ్, గౌడ సంఘం ఉపాధ్యక్షులు పోతగాని ఐలన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి విక్రేత అరెస్టు

చిక్కడపల్లి, జూన్ 24:గంజాయి తాగడంతోపాటు, విక్రయిస్తున్న ఓ యువకుడిని చిక్కడపల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అతడి వద్ద నుంచి 650 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ తెలిపిన వివరాలను వెల్లడించారు. బీహార్‌కు చెందిన రంజిత్‌కుమార్(అలియాస్ చోటు) (21) చిక్కడపల్లిలోని అన్నపూర్ణ బాయ్స్ హాస్టల్‌లో సహాయకుడిగా పనిచేస్తున్నాడు. బీహార్ రాష్ట్రం నుంచి అక్రమంగా గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తున్నాడు. గత 6 నెలలుగా గంజాయి దందా కొనసాగిస్తున్నట్లు పోలీసుల విచారణలో తెలిసింది. పోలీసులకు సమాచారం రావడంతో రంజిత్‌కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అడ్మిన్ ఎస్ఐ అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

## తరగతి గదుల్లో విద్యార్థుల సంఖ్య తగ్గించాలి



ఇంటర్మీడియట్ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న శీను నాయుడు

ముషీరాబాద్, జూన్ 24: ఇంటర్మీడియట్ తరగతి గదుల్లో విద్యార్థుల సంఖ్యను తగ్గించి అధ్యాపకుడికి ఇచ్చే సమయం పెంచాలని కోరుతూ సామాజిక కార్యకర్త జి.శీను నాయుడు ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శిని కలిసి వినతిపత్రం అందజేశారు. తరగతి గదుల్లో 60 నుంచి 65మంది విద్యార్థులను ఉంచడం వలన సరిగా చదువుకోలేని పరిస్థితి నెలకొంటుందన్నారు. అధ్యాపకులకు క్లాస్ బోధించడానికి 40నుంచి 45నిమిషాలు మాత్రమే కేటాయించడం వల్ల నాణ్యమైన విద్య అందించలేకపోతున్నారని ఫిర్యాదు చేశారు. ఫలితంగా పిల్లలు మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని, తల్లిదండ్రులు ఒత్తిడి తేవడం మూలంగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. కొన్ని ప్రభుత్వ కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడం, అధ్యాపకుల కొరత ఫలితంగా ప్రైవేట్ కళాశాలను ఆశ్రయించాల్సి వస్తుందని వివరించారు. తరగతి గదిలో అధిక మంది పిల్లలు ఉండడం వలన విద్య నంద చేయడంలో అధ్యాపకులు దృష్టి సారించలేక పోతున్నారన్నారు. తల్లిదండ్రులు వేల రూపాయలు ఖర్చు చేసి ట్యూషన్లు పెట్టాల్సి వస్తుందని తెలిపారు.

## యువతి అదృశ్యం



ఎన్.సంజన(ఫైల్)

ఉస్మానియా యూనివర్సిటీ: ఇంట్లో చోటుచేసుకున్న చిన్న గొడవ కారణంగా ఓ యువతి ఇల్లు విడిచి వెళ్లిన ఘటన లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్సై నాగరాణి తెలిపిన ప్రకారం.. ఎన్.సంజన (19) కుటుంబంతో సహా తార్నాక డివిజన్ ఇందిరానగర్‌లో ఉంటూ డిగ్రీ చదువుకుంటున్నది. ఈనెల 14వ తేదీన కుటుంబసభ్యుల మధ్య స్వల్ప గొడవ చోటుచేసుకున్నది. దీంతో సంజన ఈనెల 18న ఉదయం 11 గంటలకు సమయంలో ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. దాంతో ఆమె గురించి బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. గతంలో ఒక నెల కిందట ఇలాంటి పరిస్థితుల్లోనే ఒకసారి ఇంటి నుంచి వెళ్లిన సంజన కొన్ని రోజుల తర్వాత తిరిగి వచ్చింది. ఈసారి మాత్రం ఇంటికి తిరిగి రాకపోవడంతో సంజన అన్న సోమేశ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కాలానికనుగుణంగా విద్యాబోధన అందించాలి

**ముషీరాబాద్ డిప్యూటీ డీఈవో శ్రావణ్‌కుమార్**



డాక్టరేట్ పొందిన ఉపాధ్యాయుడు నాగయ్యను సన్మానించిన డిప్యూటీ డీఈవో శ్రావణ్‌కుమార్, ఉపాధ్యాయులు

కవాడిగూడ, జూన్ 24: మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యాబోధన అందించాలని ముషీరాబాద్ డిప్యూటీ డీఈవో శ్రావణ్‌కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. ముషీరాబాద్ విద్యామండలి పరిధిలోని కవాడిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు నాగయ్య పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ పొందిన సందర్భంగా మంగళవారం ఆయనను ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఘనంగా సన్మానించారు.శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ.. చదువుకునేందుకు వయస్సుతో నిమిత్తంలేదని, ఉపాధ్యాయుడు నిరంతర విద్యార్థి అని చెప్పారు. ఒకవైపు నాగయ్య ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూనే పీహెచ్‌డీ పూర్తి చేయడం అభినందనీయమన్నారు.ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ బోధనతోపాటు డిజిటల్ తరగతులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫాంలు అందించడంతోపాటు మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మీనాకుమారి, ఉపాధ్యాయులు యాకూబ్, సోమయ్య, సుబ్రహ్మణ్యం, హేమలత, ఐశ్వర్య, సల్లాఉద్దీన్, జానీ తదితరులు పాల్గొన్నారు.

## పని చేస్తున్న ఇంట్లోనే చోరీ భార్యభర్తల అరెస్టు

చిక్కడపల్లి, జూన్ 24: ఇంట్లో పని చేయడానికి వచ్చిన భార్యభర్తలు దొంగతనానికి పాల్పడటంతో చిక్కడపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి ఆరు తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. చిక్కడపల్లి డీఐ శంకర్ మాలోతు వివరాలను తెలిపారు. అశోక్‌నగర్‌లోని పూజా రైజింగ్ అపార్ట్మెంట్లో నేహా జైన్ కుటుంబసభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. గత సంవత్సరం అక్టోబర్ నుంచి భార్యాభర్తలు వేముల శ్రీవాణి(30), చంద్రకాంత్(35) ఇద్దరూ నేహా జైన్ ఇంట్లో పని చేస్తున్నారు. గత కొద్దిరోజులుగా బంగారు ఆభరణాలు కన్పించకపోవడంతో నేహా జైన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణలో భార్యభర్తలు ఇద్దరూ దొంగతనాలకు పాల్పడుతున్నట్టు తేలింది. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇంట్లో పని కుదుర్చుకునే ముందు వారి వివరాలను పూర్తిగా తెలుసుకోవాలని ఈ సందర్భంగా డీఐ శంకర్ ప్రజలకు సూచించారు.

## మాన్సూన్ శానిటేషన్ స్పెషల్ ప్రారంభం

చిక్కడపల్లి, జూన్ 24: గాంధీనగర్ డివిజన్ చిక్కడపల్లిలోని పీపుల్స్ పార్క్ వద్ద మంగళవారం మాన్సూన్ శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ రామానుజన్ రెడ్డి, ఏఎంఓహెచ్ డాక్టర్ ప్రవీణతో కలిసి ప్రారంభించారు. వర్షా కాలం దృష్ట్యా రోడ్లు, కాలనీలు, బస్తీల్లో పేరుకుపోయిన మట్టికుప్పలు, చెత్త చెదారం తొలగించేందుకు జీహెచ్ఎంసీ ఈ స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసిందని కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో ఎ.వినయ్ కుమార్, నాయకులు రత్నసాయిచంద్, శ్రీకాంత్, దామోదర్, పి.నర్సింగ్‌రావు, ఆకుల సురేందర్, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్పెషల్ డ్రైవ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పావని, డిప్యూటీ కమిషనర్ రామానుజన్ రెడ్డి తదితరులు

## ఆలయ కమాన్ నిర్మాణానికి పూజ

బన్సీలాల్ పేట్, జూన్ 24:పద్మారావు నగర్‌లోని హమాలిబస్తీలో శ్రీనల్లపోచమ్మ, శ్రీఉప్పలమ్మ ఆలయ కమాన్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ కే.హేమలత, బీఆర్ఎస్ పార్టీ పద్మారావు నగర్ ఇన్‌చార్జి గుర్రం పవన్‌కుమార్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, ఏసూరి మహేశ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. తన సొంత ఖర్చుతో కమాన్ నిర్మిస్తున్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు బస్తీవాసులు ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో బస్తీ అధ్యక్షుడు సుభాశ్, సత్యనారాయణ, కుషాల్, బసవరాజు, యాదగిరి, గురు, సాయిరాం, వెంకట్, శ్యామ్, రాందాస్, నారాయణ, దుర్గా, కౌసల్య, అరుణ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## సమాచార్ SAMACHAR

### ఎం ఫార్మసీ పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎం ఫార్మసీ పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎం ఫార్మసీ(పీసీఐ)(ఆల్ స్పెషలైజేషన్స్) నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫీజును ఈ నెల 30వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు, పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www. osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

### హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఓయూ పరిధిలోని హోటల్ మేనేజ్మెంట్ కోర్సులు(బీహెచ్ఎంసీటీ, బీసీటీసీఏ) పూర్తి చేసి బ్యాక్ లాగ్ సబ్జెక్టులు మిగిలిపోయిన వారికి వన్‌టైమ్ చాన్స్ కల్పించారు. ఈ మేరకు ఓయూ అకాడమిక్ సెనేట్ స్టాండింగ్ కమిటీ అనుమతించిందని, 2000 సంవత్సరం తరువాత ఆయా కోర్సుల్లో చేరినవారు సైతం తమ బ్యాక్‌లాగ్ పరీక్షలకు హాజరయ్యేందుకు అవకాశమిచ్చామని అధికారులు తెలిపారు. ఈ కోర్సుల అన్ని సెమిస్టర్ల పరీక్షా ఫీజును వచ్చే నెల 14వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని సూచించారు. అన్ని కోర్సుల పరీక్షలకు సాధారణ పరీక్షా ఫీజుతోపాటు పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం ఉన్న సిలబస్, పరీక్షా విధానంలోనే వారు పరీక్షలకు హాజరుకావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పరీక్షలను ఆగస్టు నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల వివరాలు త్వరలో ప్రకటిస్తామన్నారు.

### వివిధ కోర్సుల పరీక్షా ఫలితాల విడుదల

ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేశారు.ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలతోపాటు ఎంపీఈడీ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, సీఏ అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలు విడుదల చేశామన్నారు.

### డిగ్రీ కోర్సుల ఇన్‌స్టంట్ పరీక్షా తేదీల ఖరారు

ఓయూ పరిధిలోని డిగ్రీ కోర్సుల ఇన్‌స్టంట్ పరీక్షా తేదీలను ఖరారు చేశారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ తదితర కోర్సుల ఆరో సెమిస్టర్ ఇన్‌స్టంట్/ మేకప్ పరీక్షలను వచ్చే నెల 18వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్షా తేదీల వివరాలు వెబ్‌సైట్‌లో చూసుకోవాలన్నారు.

### పీజీ కోర్సుల పరీక్షల జవాబుపత్రాల నకలుకు దరఖాస్తుల ఆహ్వానం

ఓయూ పరిధిలోని వివిధ పీజీ కోర్సుల పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంలిబ్ఐఎస్సీ, ఎంజేఅండ్ఎంసీ, ఎంకామ్(ఐఎస్) తదితర కోర్సుల మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని అధికారులు చెప్పారు. జవాబుపత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపరు రూ.వెయ్యి చొప్పున చెల్లించి ఈనెల 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ఫలితాలపై చాలెంజ్ వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కోపేపర్‌కు రూ.10వేలు చొప్పున చెల్లించి వచ్చే నెల 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, వివరాలు ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని సూచించారు.

### ఎంఎస్సీ మాలిక్యులర్ అండ్ హ్యూమన్ జెనెటిక్స్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఓయూ పరిధిలోని ఎంఎస్సీ మాలిక్యులర్ అండ్ హ్యూమన్ జెనెటిక్స్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ డైరెక్టరేట్ ఆఫ్ పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఐ పాండురంగారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర బయోటెక్నాలజీ విభాగం(డీబీటీ)ప్రాయోజితం చేస్తున్న ఈ కోర్సును ఓయూ పరిధిలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ జెనెటిక్స్ అండ్ హాస్పిటల్ ఫర్ జెనెటిక్ డిసీజెస్ అందిస్తోందని చెప్పారు. గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఆఫ్ బయోటెక్నాలజీ(జీఏటీ-బీ) పరీక్షలో అర్హత సాధించిన వారు ఈకోర్సులో చేరేందుకు అర్హులన్నారు.ఆసక్తి ఉన్న అభ్యర్థులు వచ్చే నెల 9వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చన్నారు.

### నిరుద్యోగులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

ముషీరాబాద్, జూన్ 24:స్వాంతన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నామని సంస్థ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ చదివి, 18 నుంచి 30 ఏండ్ల మధ్య వయస్సు గల నిరుద్యోగులకు రెండు నెలలపాటు కంప్యూటర్, టైపింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, ఇంటర్వ్యూ స్కిల్స్ ఉచితంగా నేర్పించి, వారి చదువుకు తగిన అవకాశాలను కల్పిస్తామని తెలిపారు. పార్సిగుట్ట సమీపంలోని 44 నంబర్ బస్టాప్ వద్ద ఉన్న ఎంసీహెచ్ కాలనీ కమ్యూనిటీ హాలు కేంద్రానికి వచ్చి దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 8688914603లో సంప్రదించాలని కోరారు.

## ఆమ్‌ఆద్మీ విజయంతో బీజేపీకి చావుదెబ్బ

**ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్**



డాక్టర్ దిడ్డి సుధాకర్

కవాడిగూడ, జూన్ 24:గుజరాత్, పంజాబ్‌లలో జరిగిన ఉప ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ సాధించిన విజయంతో బీజేపీకి చావు దెబ్బ తగిలిందని ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. ఆప్ పారదర్శక పనితీరు చూసిన ప్రజలు ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను తిరస్కరించారన్నారు. దోమలగూడలోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ.. గుజరాత్‌లోని విసావదర్ స్థానంతో పాటు పంజాబ్‌లోని లుథియానా వెస్ట్ స్థానంలో ఆమ్ ఆద్మీ పార్టీ సాధించిన అద్భుత విజయం ఆప్ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపిందన్నారు. ప్రధాని మోదీ బూటకపు మాటలను, కాంగ్రెస్ పార్టీ చేతగాని తనాన్ని దేశ ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చేది ఆమ్ ఆద్మీ పార్టీ ఒక్కటేనని అందుకే ప్రజలు ఆప్‌ను ఆదరిస్తున్నారని అన్నారు. ఆప్ జాతీయ ప్రణాళికకు అనుగుణంగా ఉప ఎన్నికల్లో ఫలితాలు వచ్చాయని, బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థులను నిలబెట్టడంతోపాటు హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ స్థానం నుంచి కూడా ఆప్ పోటీ చేయాలని యోచిస్తున్నట్లు డాక్టర్ దిడ్డి సుధాకర్ తెలిపారు.

## ఐఐసీటీ ఉద్యోగులకు సీపీఆర్‌పై శిక్షణ



సీపీఆర్ శిక్షణలో పాల్గొన్న ఐఐసీటీ ఉద్యోగులు

బన్సీలాల్‌పేట్, జూన్ 24 : సీపీఆర్ విధానంపై అవగాహన కలిగి ఉంటే గుండెపోటుకు గురైన వారి ప్రాణాన్ని కాపాడవచ్చని ఐఐసీటీ డైరెక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం ఐఐసీటీ స్టాఫ్ క్లబ్ హాలులో జనహిత సేవా ట్రస్ట్, గాంధీ మెడికల్ కళాశాల అలుమ్ని అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత సీపీఆర్ అవగాహన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. తమ ఐఐసీటీలో పనిచేస్తున్న అధికారులు ఉద్యోగులకు శిక్షణ శిబిరం ఏర్పాటు చేసిన నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా అలుమ్ని అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ..ఎలాంటి సందర్భాల్లో ఒక వ్యక్తికి సీపీఆర్ చేయాలో వివరించారు. ప్లాస్టిక్ బొమ్మల ఆధారంగా 500 మంది ఐఐసీటీ ఉద్యోగులకు సీపీఆర్ స్వయంగా ఎలా చేయాలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనహిత సేవా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఎస్.నరసింహమూర్తి, ట్రస్టీ శ్రీధర్, ఐఐసీటీ స్టాఫ్ క్లబ్ ఇన్‌చార్జి డాక్టర్ ఆంథోనీ, డాక్టర్ వర్ష, డాక్టర్ రాజే, డాక్టర్ విజయరావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## పలువురికి పురస్కారాల ప్రదానం



సాహితీ కిరణం 16వ వార్షికోత్సవం మంగళవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా మాజీ ప్రభుత్వ సలహాదారు కె.వి.రమణాచారి పాల్గొని వివిధ రంగాల ప్రముఖులకు డాక్టర్ పింగళి జగన్నాథరావు స్మారక పురస్కారాలను అందజేశారు. వీవీ సత్యప్రసాద్, రఘువీర్ ప్రతాప్, మాధవి, రఘుశ్రీ తదితరులు స్మారక పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో గుడిబండి వెంకట్ రెడ్డి, కళా జనార్దన మూర్తి, బైసా దేవదాస్, కేతవరపు రాజశ్రీ, పొత్తూరి సుబ్బారావు, పెద్దూరి వెంకటదాసు,పి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. – ముషీరాబాద్, జూన్ 24

## రమణయ్యకు స్పోర్ట్స్ ఐకాన్ అవార్డు ప్రదానం



అంతర్జాతీయ అథ్లెటిక్స్‌లో మూడు బంగారు పతకాలు సాధించిన అంతర్జాతీయ క్రీడాకారుడు రాళ్లరాచర్ల రమణయ్యకు తెలంగాణ స్పోర్ట్స్ ఐకాన్ అవార్డు వరించింది. విశ్వఆర్ట్స్, మన కళాక్షేత్రం ఫౌండేషన్ ఆధ్వర్యంలో త్యాగరాయగాన సభలో జరిగిన కార్యక్రమంలో విశ్రాంత న్యాయమూర్తి బూర్గుల మధుసూదన్ హాజరై రమణయ్యకు అవార్డు ప్రదానం చేసి సత్కరించారు. 45 ఏండ్ల వయస్సుల్లో క్రీడా రంగంలో రాణిస్తున్న రమణయ్యను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సినీ నటుడు రాజేందర్, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డా. రంజిత్‌కుమార్ తపాల్గొన్నారు. –ముషీరాబాద్, జూన్ 24

## మారేడ్‌పల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని మార్చాలి



ప్రజావాణిలో వినతిపత్రం అందజేస్తున్న బాలల హక్కుల పరిరక్షణ వేదిక ప్రతినిధులు

అడ్డగుట్ట, జూన్ 24:ప్రభుత్వ పాఠశాల భవనంలో కొనసాగుతున్న మారేడుపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని వేరే ప్రాంతానికి మార్చాలని కోరుతూ బాలల హక్కుల పరిరక్షణ వేదిక ప్రతినిధులు మంగళవారం 'ప్రజావాణి'లో వినతిపత్రాన్ని సమర్పించారు. పాఠశాల భవనంలోనే తహసీల్దార్ కార్యాలయం కొనసాగుతుండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఈ సందర్భంగా వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో కలిపి సుమారు 1000 మంది విద్యార్థులు ఉంటారని, పాఠశాల భవనంలోనే తహసీల్దార్ కార్యాలయం సంవత్సరాలుగా కార్యకలాపాలు సాగిస్తుండటంతో విద్యార్థులకు తరగతి గదులు సరిపోక వరండాల్లో పాఠాలను నేర్చుకుంటున్నారని వారు తెలిపారు. తరగతి గదులు సరిపోక అడ్మిషన్లు వచ్చినా తిరస్కరించడం జరుగుతుందని, కావున వీలైనంత త్వరగా విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని తహసీల్దార్ కార్యాలయాన్ని వేరే ప్రాంతానికి మార్చాలని వారు కోరారు. వినతిపత్రం అందించిన వారిలో బాలల హక్కుల పరిరక్షణ వేదిక ప్రతినిధులు లక్ష్మీనారాయణ, ఎ.సువర్ణ పాల్గొన్నారు.


## ఆలయం అభివృద్ధికి పాలక మండలి కృషి చేయాలి



సమావేశంలో పాల్గొన్న ఆలయ ఈఓ రామకృష్ణ, చైర్మన్ పర్శ ప్రభాకర్ యాదవ్, కమిటీ సభ్యులు

మారేడ్‌పల్లి, జూలై 24: సికింద్రాబాద్ గణపతి ఆలయంలో ఆలయ పాలక మండలి సమావేశం ఈఓ రామకృష్ణ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో ఆలయంలో జరిగే ఉత్సవాల నుంచి వార్షిక ఉత్సవాల వరకు, ఆలయంలో జరిగే రోజు వారి పూజలకు సంబంధించిన వివరాలను ఈఓ రామకృష్ణ పాలక మండలి సభ్యులకు వివరించారు. అనంతరం ఆలయం అభివృద్ధిపై పాలక మండలి సమావేశంలో చర్చించారు. సమావేశం అనంతరం ఆలయ అధికారులతో కలిసి పాలక మండలి సభ్యులు ఆలయానికి చెందిన ఆస్తులు, భూములను సందర్శించారు. ఆలయ పాలక మండలి చైర్మన్ పర్శ ప్రభాకర్(అరవింద్) యాదవ్, కమిటీ సభ్యులు నరేశ్, సంతోష్, అనిల్ యాదవ్, గాజుల ఆంజనేయులు, మల్లేశ్, భిక్షపతి, నాగమణి, టి.నరేంద్ర, వందన, మాణిక్య ప్రభు, శ్రీరామ సాయికుమార్, ఎస్. నరేంద్ర, వేణుగోపాలచారి తదితరులు పాల్గొన్నారు.

## రెయిన్‌బో హోం విద్యార్థినులకు ఉచిత వైద్య పరీక్షలు



ముషీరాబాద్ రెయిన్‌బో హోం అనాథాశ్రమం విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్ పూర్ణిమ తదితరులు

కవాడిగూడ, జూన్ 24: టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలోని రెయిన్‌బో హోం అనాథాశ్రమంలో మంగళవారం విద్యార్థినులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆర్‌బీఎస్‌కె వైద్యులు డాక్టర్ పూర్ణిమ, డాక్టర్ హాసిని విద్యార్థినులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యతోపాటు ఆరోగ్యంపైనా విద్యార్థినులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఏ చిన్న సమస్య వచ్చినా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం విజయకుమారి, నిర్వాహకులు విజయ్‌కుమార్, శ్రీధర్, సైదులు, రజిత తదతరులు పాల్గొన్నారు.